సాక్షి
వికారాబాద్
గురువారం । 24 । ఆగస్టు । 2023



కార్పొరేట్‌కు దీటుగా

రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు దీటుగా పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 10లో▸



ఉచిత బస్సు ప్రయాణం

తాము అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి అన్నారు. 10లో▸



మా భూములు మాకే..

ఇరువై ఏళ్లకుపైగా కాస్తులో ఉన్నాం.. మా భూములు లాక్కోవాలని చూడడం సరికాదని గొట్లపల్లి వాసులు అన్నారు. 11లో▸

న్యూస్‌రీల్

టీపీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సర్దార్



పరిగి: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా సర్దార్ ఎన్నికయ్యారు. పట్టణంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు అశోక్ కుమార్ ఈ మేరకు ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సర్దార్ మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడు సత్తయ్యకు,రాష్ట్ర కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు ఇ.రఘునందన్, జిల్లా కమిటీ సభ్యులు ఎం.బసప్ప, సి.లక్ష్మయ్య, పి.శ్రీనివాస్, జి.సుందర్, శ్రీనివాస్, నజీర్, నవీన్ కుమార్, నర్సింహులు పాల్గొన్నారు.

రోడ్డు పనుల్లో నాణ్యత తప్పనిసరి

డీఈ వెంకట్‌రావు



సీసీరోడ్డును పరిశీలిస్తున్న డీఈ తదితరులు

తాండూరు రూరల్: సీసీ రోడ్డు పనుల్లో నాణ్యత ప్రమాణాలు తప్పని సరిగా పాటించాలని పంచాయతీరాజ్ డీఈ వెంకట్‌రావు ఆదేశించారు. బుధవారం మండలంలోని బెల్కటూర్‌లో ఎస్‌డీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. అనంతరం డీఈ మాట్లాడుతూ.. ప్రతి గ్రామానికి ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరయ్యాయని తెలిపారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచులకు సూచించారు. బెల్కటూర్ – వీరారెడ్డిపల్లి రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ నందిని, సర్పంచ్ మదన్‌మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభను సక్సెస్ చేద్దాం

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పరిగి: దళిత, గిరిజనుల జీవితాల్లో వెలుగులు నింపేందుకే ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ సభ నిర్వహిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో చేవెళ్ల సభ ఇన్‌చార్జ్, మాజీ ఎమ్మెల్యే విజయ రమణతో కలసి మాట్లాడారు. బీఆర్‌ఎస్ తొమ్మిదేళ్ల పాలనలో దళితులు, గిరిజనులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. వారికి ఎలాంటి సబ్సిడీ పథకాలు అమలు చేయలేదని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే వారికి అన్ని విధాలా న్యాయం జరిగిందన్నారు. ఈ నెల 26న నిర్వహించే దళిత, గిరిజన సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. గురువారం మన్నెగూడ జేకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే సన్నాహక సమావేశానికి ముఖ్య కార్యకర్తలు హాజరు కావాలని, ఈ సమావేశానికి పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, పార్టీ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్, పట్టణ అధ్యక్షుడు ఎర్రగడ్డపల్లి కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి కోసం తండ్రిని చంపిన తనయుడు

- మద్యం మత్తులో గొంతునులిమి హత్య
- పూడూరు మండలంలో ఘటన



చంద్రయ్య మృతదేహం

పూడూరు: ఆస్తి కోసం కన్నతండ్రిని కొడుకే గొంతును లిమి చంపిన సంఘటన చన్గొముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గిరి కథనం మేరకు.. పూడూరుకు చెందిన చంద్రయ్య(71), నర్సింలు తండ్రి కొడుకులు. మంగళవారం రాత్రి చంద్రయ్య అన్నం పెట్టమని అడగడంతో మద్యం మత్తులో ఉన్న నర్సింలు అన్నం లేదు.. ఏమీ లేదు.. నువ్వు చస్తే నీ ఆస్తి నాకు వస్తుందంటూ చితకబాదాడు. కోడలు జంగమ్మ, ఆమె పిల్లలు చంద్రయ్యపై దాడిని అడ్డుకున్నారు. దీంతో నర్సింలు ఇంట్లోకి వెళ్లాడు. చంద్రయ్య మరో ఇంట్లోకి వెళ్లాడు. తండ్రి నిద్రిస్తుండగా కొడుకు నర్సింలు గొంతునులిమి హత్య చేశాడు. తర్వాత ఏమీ తెలియనట్లు నిద్రలో తండ్రి చనిపోయాడని అక్క సుజాతకు తెలిపారు. తన తండ్రిని అన్న నర్సింలు చంపాడని అక్క సుజాత పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వికారాబాద్ శివరాంనగర్‌లో ఎల్‌ఈడీ స్క్రీన్‌పై చంద్రయాన్-3 ల్యాండింగ్‌ని తిలకిస్తున్న విద్యార్థులు

జాబిలిని ముద్దాడిన వేళ..

చంద్రయాన్ –3 ల్యాండర్ జాబిల్లిపై విజయవంతంగా దిగడంతో జిల్లాలో ఆనందం వెల్లివిరిసింది. చంద్రుడిపై ల్యాండర్ అడుగుపెట్టగానే ఉత్సాహంతో జనం కేకలు వేశారు. ఇస్రో శాస్త్రవేత్తల కీర్తిని కొనియాడారు. ప్రపంచంలోనే భారత్ అగ్రగామిగా నిలిచిందని సంతోషం వ్యక్తం చేశారు.



వికారాబాద్‌లో జాతీయ జెండాలతో విద్యార్థులు, ఉపాధ్యాయుల విజయకేతనం

రోడ్లు ఛిద్రం

వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

- వాహనచోదకులకు నరకయాతన
- గత ఏడాది పనులకు రూ. 59కోట్లు మంజూరు
- టెండర్ల దశ దాటని వైనం
- ఈ ఏడాది పాడైన రోడ్లు 75.7 కిలో మీటర్లు
- రూ.39.5 కోట్లతో ప్రతిపాదనలు



వికారాబాద్ - పరిగి రోడ్డు సరిగ్గా లేకపోవడంతో ఎక్సిల్ విరిగిపోయి ఆగిపోయిన లారీ

వికారాబాద్: జిల్లాలో ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ రోడ్లన్నీ పాడైపోయాయి. దీంతో వాహనచోదకులు నరకయాతన అనుభవిస్తున్నారు. రోడ్ల మరమ్మతులు, పునర్నిర్మాణ పనుల కోసం అధికారులు ప్రతిపాదనలు పంపినా నిధులు మంజూరు కాలేదు. దీంతో ఏళ్ల తరబడి వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ ఏడాది వరుస వర్షాలతో లాభాల కంటే నష్టాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఎడతెరిపి లేని వానలతో జిల్లా వ్యాప్తంగా అనేక రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రజారవాణా ఇబ్బందికరంగా మారడంతో తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అయినా ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులు స్పందించిన పాపాన పోలేదు. వర్షాలకు దెబ్బతిన్న రోడ్ల వివరాలు సేకరిస్తున్నామని చెబుతున్నారే కానీ తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టడం లేదు. ఇంకా చెప్పాలంటే గతేడాది ఇదే సీజన్‌లో పాడైన రోడ్లకు ఇంకా మరమ్మతులు పూర్తి చేయలేదు. వాటికి సంబంధించి మూడు నుంచి ఐదు సార్లు టెండర్లు పిలిచినా కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు.

గతేడాది మరమ్మతులకే దిక్కులేదు

జిల్లాలో గతేడాది కురిసిన వర్షాలకు పాడైన ఆర్‌అండ్‌బీ రోడ్ల మరమ్మతులకు ఆ శాఖ అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లా వ్యాప్తంగా 198 కిలోమీటర్ల మేర రోడ్లు దెబ్బతిన్నాయి. వీటిని పూర్తిస్థాయిలో బాగు చేసేందుకు రూ. 89 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపారు. తాత్కాలిక మరమ్మతులకు రూ. 8కోట్లు అవసరమని ప్రతిపాదనల్లో పేర్కొన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో 98కిలో మీటర్ల మేర పాడైన రోడ్లకు రూ. 39 కోట్లు, పంచాయతీ రాజ్ శాఖకు రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. అయితే టెండర్ల ప్రక్రియ దగ్గరే పనులు ఆగిపోయాయి. ఈ ఏడాది జిల్లాలో 57.7 కిలోమీటర్ల పంచాయతీ రాజ్ రోడ్లు పాడవగా రూ. 24.26 కోట్లు అవసరమని అధికారులు గుర్తించారు. మరో 20 కల్వర్టులకు రూ. 7.78 కోట్లు, 75 చోట్ల కోతకు గురైన రోడ్ల బాగు కోసం రూ. 32 కోట్లు అవసరమని గుర్తించిన అధికారులు ప్రతిపాదనలు పంపారు. జిల్లాలో 927 కిలో మీటర్ల ఆర్‌అండ్‌బీ రోడ్లు ఉండగా అందులో 18 కిలోమీటర్ల మేర పాడయ్యాయని గుర్తించారు. ఇందుకు కోసం రూ. 7.5కోట్లు అవసరమని గుర్తించి ప్రతిపాదనలు పంపారు.

అధ్వానంగా మెజారిటీ రోడ్లు

జిల్లాలో ఒకటి, రెండు రోడ్లు మినహా మెజారిటీ రోడ్లన్నీ అధ్వానంగా మారాయి. వికారాబాద్ – పరిగి, వికారాబాద్ – నవాబుపేట, వికారాబాద్ – సిద్దులూర్, వికారాబాద్ – బుగ్గదేవాలయం దారి, వికారాబాద్ – తాండూరు రహదారి, కొడంగల్ – తాండూరు, కొడంగల్ – మహబూబ్‌నగర్, పరిగి – మిట్టకోడూర్, దోమ మండలంలోని దోర్నాల్‌పల్లి – గొడుగోనిపల్లి, ఐనాపూర్ – పాలెపల్లి, గడిసింగాపూర్ – మల్లెపల్లి, పరిగి – షాద్‌నగర్, వికారాబాద్ – సదాశివాపేట్, కోటాలగూడ – లాల్‌సింగ్ తండా, మన్నెగూడ – మిర్జాపూర్ మీదుగా లల్‌సింగ్ తండా తదితర రోడ్లన్నీ అధ్వానంగా మారాయి.

బీజేపీ గెలుపు ఖాయం

- తాండూరు టికెట్టు ఎవరికిచ్చినా కలసి పనిచేయాలి
- కర్ణాటక ఎమ్మెల్సీ సతీష్‌కుమార్ యాచిరెడ్డి

తాండూరు రూరల్: బీజేపీ అధిష్ఠానం తాండూరు అసెంబ్లీ టికెట్ ఎవ్వరికి ఇచ్చినా అందరూ కలసి పనిచేసి విజయాన్ని అందించాలని కర్ణాటక రాష్ట్రం బళ్లారి ఎమ్మెల్సీ, పార్టీ పరిశీలకులు సతీష్‌కుమార్ యాచిరెడ్డి సూచించారు. బుధవారం తాండూరులో పార్టీ మండల అధ్యక్షుడు ఎస్ ఆంజనేయులు ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ.. తాండూరులో బీజేపీ అభ్యర్థి గెలుపు ఖాయమన్నారు. సీఎం కేసీఆర్ మోసపూరిత హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. కర్ణాటకలో అధికార కాంగ్రెస్ హామీలు ఇచ్చి నెరవేర్చడంలో ఇబ్బందులు పడుతోందని గుర్తుచేశారు.

ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే ఒక్కటైనా గెలవరు

తాండూరులో ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డి ఒక్కటైనా ఆ పార్టీ అభ్యర్థి గెలవరిని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మురళి కృష్ణగౌడ్ అన్నారు. తాండూరులో అధికార పార్టీ ఒక వైపు.. ప్రజలంతా మరో వైపు ఉన్నారని పేర్కొన్నారు. పోలీసు కేసుల భయంతోనే ఇప్పుడు బీజేపీలో ఎవరూ చేరడం లేదని, ఎన్నికల కోడ్ అమలులోకి రాగానే పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పూజారి పాండు, రజనీకాంత్, సంజీవ్‌రెడ్డి, ప్రదీప్ కుమార్, చిరంజీవి, ప్రశాంత్‌గౌడ్, సూర్యకాంత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ విజయానికి శ్రమించాలి: షోలాపూర్ ఎమ్మెల్యే విజయ్ దేశ్‌ముఖ్

ధారూరు: రాష్ట్రంలో బీజేపీ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు శ్రమించాలని మహారాష్ట్రలోని షోలాపూర్ ఎమ్మెల్యే విజయ్ దేశ్‌ముఖ్ పిలుపునిచ్చారు. ఎమ్మెల్యే ప్రవాస్ యోజనలో భాగంగా బుధవారం ధారూరులో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. మీ బాగోగులు అధిష్ఠానం చూసుకుంటుందని అన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సదానంద్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పాండుగౌడ్, మండల అధ్యక్షుడు రవీందర్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి వివేకానందరెడ్డి, నాయకులు నరోత్తమ్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ దేశ్‌ముఖ్

కొడంగల్ నుంచే బీఆర్‌ఎస్ పతనం




కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి

- కేసీఆర్ పాలనలో పాలమూరు పాడుబడ్డది
- రంగారెడ్డి జిల్లా దిక్కులేనిది అయింది
- పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

కొడంగల్: తెలంగాణలో బీఆర్‌ఎస్ పతనం కొడంగల్ నుంచే ప్రారంభమవుతుందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం రాత్రి ఆయన కొడంగల్ వచ్చారు. పట్టణంలోని ఆయన నివాసంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. కేసీఆర్ పాలనలో పాలమూరు పాడుబడ్డదని, రంగారెడ్డి జిల్లా దిక్కులేనిదిగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రాంతానికి కృష్ణా జలాలు తెచ్చి రైతుల పాదాలు కడుగుతానని ప్రగల్భాలు పలికిన కేటీఆర్ ఇక్కడి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. కొడంగల్ నియోజకవర్గం తనకు పుట్టినిల్లు లాంటిదన్నారు. పోగుట్టుకున్న చోటే వెతుక్కోవాలని పెద్దలు చెబుతుంటారని అన్నారు. 2018లో పోలీసులను అడ్డు పెట్టుకొని తనను ఓడించారని, మళ్లీ ఇప్పుడు పోలీసుల సాయంతో దొంగ దెబ్బ తీయాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కొడంగల్ ప్రజలు నన్ను గుండెల్లో పెట్టి చూసుకున్నారని అన్నారు. పదేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న తాను ఎవరికీ ఏ హాని చేయలేదన్నారు. ఎవరి దగ్గర డబ్బులు తీసుకోలేదన్నారు. ఎవరైనా సాయం కోరి వస్తే తమవి ఇచ్చిన చేతులే కానీ తీసుకున్న చేతులు కావన్నారు. ఇప్పుడు ఉన్న పాలకులు చచ్చిన శవాలను కూడా వదలడం లేదని ఆరోపించారు. కేసీఆర్‌కు పోలీసులు ఉంటే.. కాంగ్రెస్‌కు కార్యకర్తలు ఉన్నారని పేర్కొన్నారు. మీరే నా సైనికులు.. మీరే నా బలం.. బలగమని అన్నారు. త్వరలో తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వస్తుందని, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, ఆసరా పింఛన్లు నెలకు రూ.4 వేలు ఇస్తామన్నారు. కేసీఆర్ చేసిన రుణమాఫీ మిత్తీకి కూడా సరిపోలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కేసీఆర్ కుటుంబం కోట్ల రూపాయలు దండుకుందని ఆరోపించారు. తాము అధికారంలోకి రాగానే అక్రమార్కుల భరతం పడతామని హెచ్చరించారు. ఈ నెల 26న చేవేళ్లలో జరిగే ప్రజా గర్జన సభకు వికారాబాద్ జిల్లా నుంచి అధిక సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనుముల తిరుపతిరెడ్డి, పలు మండలాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

మినిస్టర్ ‘పట్నం’

- మహేందర్‌రెడ్డికి రెండోసారి అమాత్య యోగం
- తాండూరు అసెంబ్లీ టికెట్ త్యాగానికి దక్కిన ఫలితం



తాండూరు: తాండూరు రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డికి మంత్రి పదవి లభించింది. గురువారం రాజ్‌భవన్‌లో ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి.

నాలుగుసార్లు ఎమ్మెల్యేగా..

పట్నం మహేందర్‌రెడ్డి నాలుగుసార్లు తాండూరు ఎమ్మెల్యేగా గెలిచారు. 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి గెలిచి టీఆర్‌ఎస్‌లో చేరారు. ఆ తర్వాత బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేగా గెలిచి రాష్ట్ర ప్రభుత్వంలో తొలి రవాణా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. పట్నం ఫ్యామిలీకి ప్రజల్లో మంచి ఆదరణ ఉంది. నిత్యం కార్యకర్తలకు అందుబాటులో ఉంటారు. తాండూరుతో పాటు జిల్లాలో కూడా ఆయనకు పెద్ద ఎత్తున అనుచరగణం ఉంది. మహేందర్‌రెడ్డి సతీమణి పట్నం సునీతారెడ్డి ఉమ్మడి రంగారెడ్డి జెడ్పీ చైర్‌పర్సన్‌గా రెండు పర్యాయాలు బాధ్యతలు నిర్వహించారు. ఆ తర్వాత జిల్లాల పునర్విభజనలో భాగంగా వికారాబాద్ జిల్లా తొలి జెడ్పీ చైర్‌పర్సన్‌గా కొనసాగుతున్నారు. తమ్ముడు పట్నం నరేందర్‌రెడ్డి కొడంగల్ ఎమ్మెల్యేగా, సోదరుడి కుమారుడు అవినాష్ రెడ్డి షాబాద్ జెడ్పీటీసీగా ఉన్నారు.

పైలెట్‌కు టికెట్ ఇవ్వడంతో..

కొంతకాలంగా ఉప్పు నిప్పుగా ఉన్న ఎమ్మెల్సీ పట్నం మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పైలెట్ రోహిత్‌రెడ్డిలను బీఆర్‌ఎస్ అధిష్ఠానం ఒక్కటి చేసింది. పైలెట్ రోహిత్‌రెడ్డికి సీఎం కేసీఆర్ మరో సారి టికెట్ ఇచ్చారు. టికెట్టు కోసం ప్రయత్నించిన పట్నం మహేందర్‌రెడ్డిని బుజ్జగించి క్యాబినెట్ విస్తరణలో అవకాశం కల్పిస్తామని హామీ ఇచ్చారు. హామీ మేరకు గురువారం మహేందర్‌రెడ్డి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. మంత్రిగా రెండోసారి బాధ్యతలు తీసుకోనుండడంతో ఆయన వర్గీయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

- సమస్యలు విన్నవించేందుకే నిరసన కార్యక్రమం
- బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నర్సింలు
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడికి యత్నం
- నిరసనకారులను స్టేషన్‌కు తరలించిన పోలీసులు



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

కొడంగల్ రూరల్: ప్రత్యేక రాష్ట్రం సాధించుకుని తొమ్మిదేళ్లు కావస్తున్నా ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ నర్సింలు ఆరోపించారు. పార్టీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు బుధవారం నియోజకవర్గంలోని కొడంగల్, కోస్గి, బొంరాస్‌పేట, దౌల్తాబాద్, దుద్యాల మండలాలకు చెందిన నాయకులు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి చేపట్టారు. ఎమ్మెల్యే లేకపోవడంతో గేటు వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నారాయణపేట – కొడంగల్, పాలమూరు – రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు ఇప్పటి వరకు అమలుకు నోచుకోలేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం రాష్ట్రంలో అమలుకు నోచుకోవడం లేదన్నారు. ఫసల్ బీమా పథకానికి రాష్ట్ర ప్రభుత్వం తన వాటాగా రూ. 5వందల కోట్లు చెల్లిస్తే ఇక్కడి రైతులకు ఎంతో మేలు జరిగేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ పథకం ఇప్పటి వరకు అతీగతీ లేదన్నారు. తొమ్మిదేళ్లుగా నిరుద్యోగ భృతి అమలు కాలేదన్నారు. నియోజకవర్గంలో పాఠశాలలకు స్థలం లేదనే నెపంతో చేవెళ్ల తదితర ప్రాంతాలకు తరలిస్తున్నారని ఆరోపించారు. కొత్త మండలాల్లో వసతులు కల్పించడం లేదని మండిపడ్డారు. ఎన్నికలకు ఇంకా మూడు నెలల సమయం ఉన్నందున ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి నియోజకవర్గంలోని సమస్యలను సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి విషయం తెలుసుకున్న పోలీసులు నిరసనకారులను స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో బీజేపీ కో-కన్వీనర్ రాములు,జిల్లా కార్యదర్శి కె.చంద్రప్ప, కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి కూర వెంకటయ్య,నాయకులు బాబయ్య నాయుడు,నర్సింలు, రాములు, శ్రీకాంత్, బందెప్ప, సతీష్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఉచిత వైద్య శిబిరం

బొంరాస్‌పేట: లయన్స్ క్లబ్ ఆఫ్ కొడంగల్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించున్నట్లు క్లబ్ సభ్యులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. కొడంగల్ ప్రభుత్వాస్పత్రిలో ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం వరకు నిర్వహించే పరీక్షలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యోగులు

అనంతగిరి: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని టీఎస్‌సీపీఎస్ ఈయూ జిల్లా నాయకులు కోరారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హరినాథ్, నరేందర్, విప్లవర్ధన్‌రెడ్డి, భాస్కర్, శ్రీనివాస్, గోవింద్, పవన్, శ్రీకాంత్, విశ్వం పంతులు తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి ట్రాక్టర్ బోల్తా

దోమ: ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడిన ఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. దోమ మండలం మల్లేపల్లి గ్రామానికి చెందిన కుమ్మరి మల్లయ్య బుధవారం ట్రాక్టర్‌ను అదే గ్రామానికి చెందిన తన డ్రైవర్ శ్రీకాంత్‌కు ఇచ్చి దాదాపూర్ గ్రామానికి డీఏపీ బస్తాల కోసం పంపించారు. డీఏపీ బస్తాలను ట్రాక్టర్‌లో లోడ్ చేసుకొని వస్తున్న క్రమంలో మల్లేపల్లి గేట్ సమీపంలో ట్రాక్టర్‌కు బ్రేక్‌లు పడకపోవడంతో బోల్తా కొట్టింది. అయితే ఈ క్రమంలో ట్రాక్టర్‌పై డ్రైవర్ శ్రీకాంత్‌తో పాటు ఉన్న మరో ఇద్దరు యువకులు కిందకి దూకేశారు. దీంతో తృటిలో ప్రమాదం తప్పింది.

ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా..

ఎల్బీనగర్ ఘటనపై గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ ఫైర్

పరిగి: గిరిజన మహిళపై థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసులను విధుల నుంచి తొలగించాలని గిరిజన విద్యార్థి సంఘం వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం పరిగిలో ఆయన మాట్లాడుతూ... ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌లో గిరిజన మహిళపై విచక్షణారహితంగా థర్డ్ డిగ్రీని ప్రయోగించి ఇబ్బందులకు గురిచేయడం ఆవేదనకరమని అన్నారు. పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని మహిళ అని చూడకుండా ఆమెను చిత్రహింసలకు గురిచేయడం దేనికి సంకేతమన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటే ఇదేనా అన్నారు. సంబంధిత పోలీసులను విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు.. కమల్‌నాయక్, లక్ష్మణ్ నాయక్, నీల్యానాయక్, రవీందర్ నాయక్, వెంకట్ నాయక్, అరుణ్, లక్ష్మీబాయి, రమణబాయి తదితరులు పాల్గొన్నారు.

నూతన పద్ధతులతో అధిక దిగుబడి

మొయినాబాద్ రూరల్: సాగులో అధికారుల సూచనలు, సలహాలు పాటించి అధిక దిగుబడి సాధించాలని రాజేంద్రనగర్ వ్యవసాయ విశ్వవిద్యాలయ పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ రాంగోపాల్‌వర్మ, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ కిరణ్ బాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని నక్కలపల్లి గ్రామంలో పంటల సాగును పరిశీలించారు. నేల సారవంతాన్ని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటించినప్పుడే అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. వరిలో కాండంతొలుచు పురుగును ఎలా అరికట్టవచ్చో అవగాహన కల్పించారు. మట్టి నమూనాలను బట్టి ఎరువులను వాడితే అధిక దిగుబడి వస్తుందని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ అనిత, డాక్టర్ శ్రీజయ, మండల వ్యవసాయ అధికారి రాగమ్మ, రైతులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా వసతులు

- ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి
- విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు అందజేత


దోమ: విద్యార్థులకు బస్‌పాస్‌లను అందజేస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

దోమ: రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలు కార్పొరేట్‌కు ధీటుగా పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. దోమ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలోని విద్యార్థులకు బుధవారం ఆయన సొంత నిధులతో ఉచిత బస్‌పాస్‌లను జెడ్పీటీసీ నాగిరెడ్డితో కలసి అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. ఉపాధ్యాయులు విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారి భవిష్యత్‌కు బాటలు వేయాలన్నారు.

అన్నివర్గాల అభ్యున్నతే ధ్యేయం

మండల పరిధిలోని దిర్సంపల్లిలో పర్యటించిన ఎమ్మెల్యే కొప్పుల.. పండుగల సాయన్న విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేయడంతో పాటు బీసీ, మైనార్టీ భవనాల నిర్మాణానికి భూమి పూజచేశారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో ఉన్న అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడడంతో పాటు అవసరమైన భవనాలను నిర్మించేందుకు చర్యలు తీసుకుంటున్నారని అన్నారు. వైస్ ఎంపీపీ మల్లేశం, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు రాజిరెడ్డి, దిర్సంపల్లి సర్పంచ్ శాంత, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు లక్ష్మయ్య, కోఆప్షన్ సభ్యుడు ఖాజాపాష, పీఏసీఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గోపాల్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

బీజేపీ నేతల నిరసన..

పరిగి: పరిగి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బుధవారం బీజేపీ నాయకులు నిరసన చేపట్టారు. ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేసి క్యాంపు కార్యాలయాన్ని నిర్మిస్తే.. ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి ఆ కార్యాలయాన్ని ఏనాడు తెరవరన్నారు. ఇంటి నుంచే అన్ని కార్యకలాపాలు చేపడుతున్నారన్నారు. అలాంటప్పుడు క్యాంపు కార్యాలయం నిర్మించి ఏం ఉపయోగమన్నారు. ఎమ్మల్యే క్యాంపు కార్యాలయంలో అందుబాటులో ఉండాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న పోలీసులు బీజేపీ నాయకులను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు.

దివ్యాంగుల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యేలు జైపాల్ యాదవ్, యాదయ్య


ఆమనగల్లు: దివ్యాంగులకు ప్రొసీడింగ్ పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

ఆమనగల్లు: ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేయడంలో తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలిచిందని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. ఏరాష్ట్రంలో లేనివిధంగా ప్రజల సంక్షేమం కోసం సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా దివ్యాంగులకు రూ.4016 పింఛన్ అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని చెప్పారు. ఆమనగల్లు పట్టణంలోని ఆలేటి నారాయణసాగర్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం కల్వకుర్తి అసెంబ్లీ నియోజకవర్గంలోని అన్ని మండలాలకు చెందిన దివ్యాంగుల పింఛన్ పెంపు ఉత్తర్వులను ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ లబ్ధిదారులకు అందించారు. ఈ కార్యక్రమంలో ఆమనగల్లు జెడ్పీటీసీ అనురాధ, వెల్దండ జెడ్పీటీసీ విజితారెడ్డి, వైస్ ఎంపీపీ జక్కు అనంతరెడ్డి, ఆమనగల్లు, కల్వకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్లు శ్రీనివాస్‌రెడ్డి, విజయ్‌గౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ రాధమ్మ, ఎంపీటీసీలు కుమార్, సరిత పంతునాయక్, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు అర్జున్‌రావ్, రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంలో దేశానికే ఆదర్శం..

చేవెళ్ల: ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారం దివ్యాంగులకు ఈనెల నుంచి రూ.4016 పింఛన్ అందిస్తోందని ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. చేవెళ్ల ఎంపీడీ కార్యాలయం వద్ద బుధవారం చేవెళ్ల డివిజన్‌లోని నాలుగు మండలాలకు చెందిన దివ్యాంగుల పింఛన్ డబ్బులు, పెంచిన ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు. దివ్యాంగులను గతంలో ఏ ప్రభుత్వం పట్టించుకోలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాలతి, శంకర్‌పల్లి ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్లు మిట్ట వెంకటరంగారెడ్డి, పాపరావు, సర్పంచ్‌లు, ఎంపీడీఓలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం


సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి

పూడూరు: తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కర్ణాటకలో మాదిరిగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని డీసీసీ అధ్యక్షుడు టి.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని రాకంచర్ల, దేవనోనిగుడ, బాకాపూర్ గ్రామాల్లో ఆయన పర్యటించి కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని అన్నారు. ఇళ్లులేని వారికి ఇంటి స్థలాలు ఇవ్వడంతో పాటు రూ.5లక్షలతో ఇంటిని నిర్మించి ఇస్తామని తెలిపారు. ఎకరాకు రూ.15వేల రైతుబంధు ఇస్తామన్నారు. ప్రతి ఇంటిలో రెండు పింఛన్లు ఇస్తామని అన్నారు. ఈ సందర్భంగా పలు పార్టీలకు చెందిన నాయకులు టీఆర్ఆర్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ కార్యక్రమంలో ఏసీ సమన్వయకర్త మాజీ ఎమ్మెల్యే విజయరామారావు, పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పెంటయ్య, శ్రీనివాస్, మండల అధ్యక్షుడు సురేందర్, చేవెళ్ల పార్లమెంట్ సెక్రెటరీ సత్తార్, నాయకులు భాస్కర్, రఘురాంరెడ్డి, గోపాల్, విశ్వనాథం, రాములునాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఎండుతున్న పంటలు

- నెలరోజులుగా ముఖం చాటేసిన వరుణుడు
- ఎండిపోతున్న పంటలు
- దిక్కుతోచని స్థితిలో రైతన్న


తంగెళ్లపల్లి శివారులో ఎండిన మొక్కజొన్న పంట

కొందుర్గు: ఓవైపు అతివృష్టి.. మరోవైపు అనావృష్టి.. ప్రకృతి రైతన్నలపై కన్నెర్ర చేసింది. ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తే నెలరోజుల పాటు ఎడతెరిపి లేని వర్షాలతో పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. కొన్నిరోజులపాటు వర్షాలు తెరిపినివ్వడంతో ఊరట పడితే వరుసగా నెల రోజులపాటు వర్షాలు లేక మరోసారి పంటలు దెబ్బతినడంతో రైతన్నలు విలవిలలాడుతున్నారు. జిల్లాలోని కొందుర్గు, జిల్లేడ్ చౌదరిగూడ, ఫరూఖ్‌నగర్, కేశంపేట, తలకొండపల్లి, షాబాద్ మండలాల్లో మెజార్టీ ప్రజలు వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నారు. ఈ ప్రాంతంలో అధికంగా పత్తి, మొక్కజొన్న, వరి, కూరగాయపంటలు సాగుచేస్తారు.

వర్షాధార పంటలే ఎక్కువ..

ఈ ప్రాంతంలో అధికంగా ఎర్రనేలలు ఉన్నాయి. దీంతో వర్షాధార పంటలే ఎక్కువగా పండుతాయి. వారానికో, పది రోజులకో ఓ వర్షం కురిస్తే పంటలు ఏపుగా పెరిగి రైతులు ఆశించిన దిగుబడి లభిస్తుంది. ఈ ఏడాది దాదాపు 50వేల ఎకరాల్లో మొక్కజొన్న, 55వేల ఎకరాల్లో పత్తి, 20వేల ఎకరాల్లో వరి, 10వేల ఎకరాల్లో కూరగాయల పంటలు సాగుచేశారు.అయితే ఈ ఏడాది పునాస పంటల సాగు కోసం విత్తనాలు నాటిన ఆరంభంలోనే జూలైలో వరుసగా దాదాపు నెలరోజులపాటు వర్షాలు కురియడంతో పంటపొలాల్లో కలుపు మొక్కలు పెరిగి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఇక ఆగస్టులో కాస్త వర్షాలు తగ్గడంతో రైతులు పంటపొలాల్లో నుంచి కలుపుమొక్కలు తొలగించి, భూములను చదును చేసుకున్నారు. పంటలకు అవసరమైన రసాయనిక ఎరువులు వేశారు. అయితే ప్రస్తుతం దాదాపు నెలరోజులు కావస్తున్నా వర్షాలు కురియక పోవడంతో పంటలు ఎండిపోతున్నాయి. వేల రూపాయల పెట్టుబడులు పెట్టి సాగుచేసిన పంటలు కళ్లముందే ఎండిపోవడం చేసి రైతన్నలు కంటనీరు పెడుతున్నారు.

ప్రభుత్వమే ఆదుకోవాలి



రెండు ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. వర్షాలు లేక పంట పూర్తిగా దెబ్బతింది. ఏమి చేయాలో తెలియని పరిస్థితి. పంటల పెట్టుబడి కోసం దొరికిన చోట అప్పులు చేశాం. అప్పులు ఎలా తీర్చాలి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

– కుమ్మరి అంజయ్య, ఉత్తరాసిపల్లి

పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి



2.5 ఎకరాల్లో పత్తి, 2–5 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగుచేశాను. లక్ష రూపాయల వరకు పెట్టుబడి పెట్టాను. వర్షాలు లేక పంటలు ఎండిపోతున్నాయి. మొక్కజొన్న పంట ఇప్పుడు వర్షం వచ్చినా తేరుకోదు. ఈ సమయంలో వర్షం కురిస్తే పత్తిపంట పెట్టుబడి అయినా రావచ్చు.

– వెంకటేశ్వర్ రెడ్డి, రైతు, ఉత్తరాసిపల్లి

పోలీసులపై క్రిమినల్ కేసులు పెట్టాలి


లక్ష్మిని పరామర్శిస్తున్న సంధ్య తదితరులు

పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య

మీర్‌పేట: విచారణ పేరుతో గిరిజన మహిళను దారుణంగా కొట్టిన పోలీసులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంధ్య డిమాండ్ చేశారు. ఇటీవల ఎల్‌బీనగర్ పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడ్డ గిరిజన మహిళ లక్ష్మిని మీర్‌పేట నందిహిల్స్‌లోని ఆమె నివాసంలో సంధ్య కలిసి పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ.. విచారణ పేరుతో లక్ష్మిని పోలీసులు ఇష్టం వచ్చినట్లు కొట్టడం బాధాకరమని, ఈ సంఘటనకు సంబంధించి ఇద్దరు పోలీసులను సస్పెండ్ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకుందన్నారు. రాత్రిపూట పోలీస్‌స్టేషన్లలో మహిళలను కస్టడీలో ఉంచడం సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం నేరమని, అయినా పోలీసులు లక్ష్మిని రాత్రి స్టేషన్‌లో ఉంచారని ఆరోపించారు. పోలీసులు, అధికారులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయడంతో పాటు బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్‌చేశారు. పరామర్శించిన వారిలో ఇఫ్టూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అనూరాధ, పీఓడబ్ల్యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు సరళ, గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి భారతి, నాయకులు రాణి, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పరశురాం, రాష్ట్ర నాయకులు రియాజ్, నాగరాజు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు నవీన్ తదితరులు ఉన్నారు.

బావిలో పడి బాలుడి మృతి


మృతదేహాన్ని వెలికితీస్తున్న గ్రామస్తులు

మోమిన్‌పేట: వ్యవసాయ పొలం వద్ద బావిలో పడి ప్రమాదవశాత్తు బాలుడు మృతిచెందిన సంఘటన మోమిన్‌పేటలో బుధవారం ఉదయం చోటు చేసుకొంది. ఎస్ఐ విఠల్‌రెడ్డి తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అంరాధికుర్దు గ్రామానికి చెందిన మునిగే అనిత.. కుమారుడు చంద్రకాంత్(15) సమీపంలోని కోల్కుంద ఉన్నత పాఠశాలలో 10వ తరగతి చదవుతున్నాడు. తండ్రి నర్సింహులు ఇదివరకే మృతి చెందాడు. తల్లి అనిత బుధవారం పత్తికి మందు పిచికారీ చేసేందుకు పొలానికి వెళ్తుండగా ఆమెతో పాటు చంద్రకాంత్ కూడా వెళ్లాడు. పొలం పనుల్లో భాగంగా చంద్రకాంత్ నీళ్లు తీసుకువచ్చేందుకు బావి వద్దకు వెళ్లి ప్రమాదవశత్తు కాలిజారి పడిపోయాడు. ఈతరాకపోవడంతో నీళ్లలో మునిగిపోయాడు. కుమారుడు ఎంతకూ రాకపోయేసరికి చుట్టుపక్కల గాలించగా బావిలో కొడుకు విగతజీవిగా పడిఉన్నాడు. తల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శవ పంచానామా నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ రిజిస్ట్రార్ మధుబాబు బదిలీ

ఇబ్రహీంపట్నం: సుదీర్ఘకాలంగా ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసిన పి.మధుబాబును చంపాపేట్ సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీ చేస్తూ బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. సుమారు 7 సంవత్సరాల పాటు ఇక్కడ మధుబాబు విధులను నిర్వర్తించారు. ఆయన స్థానంలో జిల్లా కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సంధ్యారాణి సబ్‌రిజిస్ట్రార్‌గా ఇక్కడికి వస్తున్నారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది మధుబాబును సన్మానించారు.

మద్యానికి బానిసై..

- ఇంటినుంచి వెళ్లిపోయిన వ్యక్తి
- గ్రామశివారులోని కుంటలో శవమై తేలిన వైనం


మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

కొందుర్గు: ఇంటినుంచి వెళ్లిపోయిన వ్యక్తి కుంటలో శవమై కనిపించిన సంఘటన కొందుర్గు మండలంలోని కొత్త ఆగిర్యాలలో చోటుచేసుకుంది. ఎస్ఐ కృష్ణయ్య తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాగం మల్లేష్(37) మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో కొద్దిరోజుల క్రితం కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంటినుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం ఎంత వెతికినా ఫలితం దక్కలేదు. ఈ క్రమంలో కొత్త ఆగిర్యాలలో శివారులోని సంఘనాథ్ కుంటవద్ద బుధవారం స్థానికులకు బైక్, చెప్పులు కనిపించాయి. ఈ విషయాన్ని పోలీసులకు సమాచారం ఇవ్వడంతో కుంటలో గాలించి మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడి తల్లి అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

ఓటరు జాబితా పక్కాగా ఉండాలి

ఆర్డీఓ సాయిరాం


బీఎల్‌ఓలతో మాట్లాడుతున్న ఆర్డీఓ

చేవెళ్ల: ఓటరు జాబితాపై బీఎల్‌ఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చేవెళ్ల ఆర్డీఓ పి.సాయిరాం అన్నారు. చేవెళ్ల ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం మండలంలోని బీఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ మాట్లాడుతూ.. ఓటరు జాబితాపై బూత్‌స్థాయిలో విచారణ చేయిస్తున్నట్లు చెప్పారు. ఓటరు లిస్టులో ఎవరివైనా పేర్లు డిలీట్ అయితే.. వారు మళ్లీ బూత్‌స్థాయి అధికారుల వద్ద కొత్త ఓటు నమోదు కోసం ఫారం–6 ద్వారా ఆన్‌లైన్‌లో లేదా నేరుగా దరఖాస్తు చేసుకోవాలని తెలియజేయలన్నారు. ఈనెల 26, 27, సెప్టెంబర్ 2, 3 తేదీల్లో అన్ని గ్రామ పంచాయతీలలో టామ్‌టామ్ వేయించి బూత్‌స్థాయి అధికారి ద్వారా కొత్త ఓటరు నమోదుకోసం దరఖాస్తులు స్వీకరించాలని సూచించారు. దీనికి అన్ని బూత్ లెవల్ అధికారులు సిద్ధంగా ఉండాలని చెప్పారు. ఈ సమావేశంలో చేవెళ్ల తహసీల్దార్ కృష్ణయ్య, నాయబ్ తహసీల్దార్ రాజశేఖర్, ఎంపీడీఓ హిమబిందు, రెవెన్యూ అధికారులు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

కేశంపేటలో ఒడిశా బృందం


మహిళా సమాఖ్య సభ్యులతో ఒడిశా బృందం

కేశంపేట: ఒడిశాకు చెందిన ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అధికారులు హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎన్ఐఆర్‌డీ)లో శిక్షణ అనంతరం క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా మండల మహిళా సమాఖ్య సభ్యులతో బుధవారం సమావేశమయ్యారు. మహిళా సమాఖ్య ద్వారా అమలుచేస్తున్న పథకాల గురించి తెలుసుకున్నారు. అనంతరం కస్టమర్ హైరింగ్ సెంటర్, భూతల్లి ఫార్మర్ ప్రొడ్యూసర్ కంపెనీ సంఘం వారి పనితీరును అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయిలో వారి పనితీరును పరిశీలించారు. ప్రొగామ్ కోఆర్డినేటర్ ప్రదీప్‌గౌడ్, రీసెర్చ్ అధికారి నిస్సి జాన్, డీఆర్‌డీఏ జిల్లా ప్రాజెక్టు మేనేజర్లు శేఖర్, నర్సింహ, ఏపీఎంలు భగవంతు, శిరీష, విజయ, చంద్రకళ, సుగుణమ్మ, గీత,గిరి, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించండి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశ వర్కర్లు, సీఐటీయూ నాయకులు

అనంతగిరి: ఆశ వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం వికారాబాద్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆశ వర్కర్లు గ్రామాల్లోనే నిరంతరముంటూ ప్రజల ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నారన్నారు. కోవిడ్‌లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పనిచేశారని గుర్తుచేశారు. ప్రభుత్వం వారి సేవలను గుర్తించి వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, ఆశ కార్యకర్తల జిల్లా కార్యదర్శి మంగమ్మ, సుజాత, రాజమణి, రాధమ్మ, శ్రీదేవి, ఉమాదేవి, మధు తదితరులు పాల్గొన్నారు.

కులవృత్తులను ప్రోత్సహిస్తాం

ఇబ్రహీంపట్నం: బీఆర్ఎస్‌తోనే అన్నివర్గాలకు న్యాయం జరుగుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో మొదటి విడతలో బీసీ బంధు కింద ఎంపికైన 300 మంది లబ్ధిదారులకు బుధవారం ఇబ్రహీంపట్నం శాస్త్రా గార్డెన్‌లో చెక్కులను పంపిణీ చేశారు. బీసీ కార్పొరేషన్ డిప్యూటీ డైరెక్టర్ విమలాదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వెంకటరమణారెడ్డి, ఎంపీపీ కృపేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ స్రవంతి, బీఆర్ఎస్ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

కులవృత్తులకు గుర్తింపు..

షాద్‌నగర్: కులవృత్తుల వారికి ప్రభుత్వం చేయూతనందిస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ప్రభుత్వం బీసీ బంధు పథకం కింద నియోజకవర్గంలో 294 మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష రూపాయల చొప్పున మంజూరు చేసింది. బుధవారం పట్టణంలోని కింగ్ ప్యాలెస్ ఫంక్షన్ హాల్‌లో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, మున్సిపల్ చైర్మన్ నరేందర్, జెడ్పీ వైస్‌చైర్మన్ గణేష్, రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

భర్త వేధింపులు తాళలేక..

- ఉరివేసుకుని నవవధువు ఆత్మహత్య
- గొల్లూరులో ఘటన

మహేశ్వరం: భర్త వేధింపులు భరించలేక నవవధువు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండల పరిధిలోని గొల్లూరులో బుధవారం చోటు చేసుకుంది. మహేశ్వరం సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్ జిల్లా మోస్రా మండలం, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బొప్పారం సాయిలు కూతురు అనూష(22)ను అదే గ్రామానికి చెందిన పెద్దిగారి మల్లయ్య చిన్నకుమారుడు యోగేష్‌కి ఇచ్చి మే–2023లో వివాహం జరిపించారు. వివాహ సమయంలో ఒప్పుకున్న బంగారం, వంట సామగ్రితో పాటు ఇతర వస్తువులను కట్నకానుల కింద అప్పగించారు. మహేశ్వరం మండలం గొల్లూరు గ్రామంలో రామరావు తోటలో యోగేష్ కూలీ పనులు చేస్తుండేవాడు. వివాహం అనంతరం భార్య అనూషపై యోగేష్ అనుమానంతో వేధించసాగాడు. ఈ క్రమంలో కుటుంబ సభ్యులు, గ్రామ సర్పంచ్ సమక్షంలో పంచాయతీ పెట్టి కౌన్సెలింగ్ ఇచ్చారు. అనంతరం కొన్నిరోజులు దంపతులు ఇద్దరూ బాగానే ఉంటున్నారు. ఈనెల 20న గొల్లూరులో పనిచేసే తోటకు భార్యను తీసుకొచ్చాడు యోగేష్. ఈ క్రమంలో బుధవారం(23న) ఉదయం 7:30 నిమిషాలకు అనూష.. తన తల్లికి ఫోన్ చేసి భర్త యోగేష్ కొట్టి వేధిస్తున్నాడని చెప్పింది. ఉదయం 8:30 గంటల సమయంలో తోటలో ఉండే గదిలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. అదే తోటలో పనిచేసే మృతురాలి బంధువు సంధ్య గదిలోకి వెళ్లి చూడగా అనూష ఉరివేసుకొని ఉంది. వెంటనే మహేశ్వరం పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం అందిచారు. తన కూతురు అనూషను అల్లుడు యోగేష్ ఉరివేసి చంపినట్లు అనుమానం ఉందని పోలీసులకు మృతురాలి తండ్రి సాయిలు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నర్సింహ తెలిపారు.